సంబరంగా గణిత దినోత్సవం

- మ్యాథ్స్ ముగ్గులు, నమూనాలతో కనువిందు
- పాఠశాలల్లో ఘనంగా గణిత దినోత్సవం


చంద్రంపాలెం హైస్కూల్లో గణిత ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

మధురవాడ: విద్యార్థులు సామాన్య, సాంఘిక శాస్త్రాల్లోనే కాదు గణిత శాస్త్రంలో కూడా ముగ్గులు, పలు రకాలు ఫజిల్స్ వేసి, ఎగ్జిబిషన్‌లో పలు నమూనాలు ఏర్పాటు చేసి అందరినీ ఔరా అనిపించారు. ఈ చక్కనైన కార్యక్రమానికి చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామనుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం పాఠశాలలో పండుగలా నిర్వహించారు. గణితంపై వ్యాసరచన, వక్తృత్వ, రంగవల్లులు, సూత్రాలు, లెక్కలు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించే పద్ధతులు, ఇతర అంశాలపై 150 రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీనిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు తదితరులు ప్రారంభించారు. పాఠశాల్లో నిర్వహించిన వేడుకల్లో రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి గణిత శాస్త్రంలో ఆయన సేవలను కొనియాడారు. సుమారు 500మంది విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గణిత అంశాలపై బాలికలు వేసిన ముగ్గులు ముచ్చట గొలిపాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ స్వామి, పీసీ సభ్యులు పిళ్లా సూరిబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

పద్మనాభం: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 30 ప్రాజెక్టులు ప్రదర్శించారు. రంగులతో చిత్రీకరించిన శ్రీనివాస రామానుజన్ చిత్రం అందర్నీ ఆకట్టుకుంది. హెచ్ఎం ఎ.బాలామణి ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయుడు టి.రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రదర్శనను రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.సన్యాసిరావు, విద్యార్థులు తిలకించారు. మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామానుజన్ చిత్ర పటానికి సర్పంచ్ బి.సన్యాసమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు.

తగరపువలస: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు.విద్యార్థులకు గణిత విభాగాలలో పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయు అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.వి. పాపారావు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, కన్వీనర్ జేఆర్జీ పట్నాయక్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నారావు పాల్గొన్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ రామానుజన్ చిత్రపటానికి విద్యార్థులతో కలిసి నివాళులు అర్పించారు. నంబర్ 1729 నమూనాలో కూర్చుని విద్యార్థులు నివాళులు అర్పించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో జరిగిన రామానుజన్ జయంతి కార్యక్రమంలో జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి రాధాకుమారి, మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందించారు.

20వ శతాబ్దపు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గణిత మేధావులలో శ్రీనివాస రామానుజన్ ఒకరని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు.

పీఎం పాలెం : కారుషెడ్ కూడలి.. వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న మాల తాంబ విద్యానికేతన్‌లో శుక్రవారం ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధురవాడ జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ గణితం పట్ల విద్యార్థులకు బాల్య దశ నుంచి ప్రత్యేక శద్ధ తీసుకుంటే మంచి ఫలితాలు రాబట్టడంతో పాటు మేధస్సును పదును పెట్టవచ్చునన్నారు. శ్రీనివాస రామానుజన్ గణితంలో ఆయన ఎన్నో అద్భుతాలు చేశారన్నారు. అందుకు గుర్తింపుగా ప్రతి యేటా డిసెంబర్ 22 వ తేదీని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకొంటున్నామని వివరించారు.

గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మాల తాంబ విద్యా సంస్థల అధినేత సునీల్ మహంతి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ టీఎస్సార్ ప్రసాద్, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. హనుమంతరావు, స్థానిక సీనియర్ నాయకుడు రోశిరెడ్డి, జి.గోపాల్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆదిమూర్తి తదితరులు విద్యార్థులు తయారు చేసిన నమూనాలు తిలకించారు.


పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రంగులతో వేసిన శ్రీనురామానుజన్ చిత్రం


రామానుజన్‌కు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారిని రాధాకుమారి నివాళులు


అవంతి కళాశాలలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు


రామానుజన్ నంబర్ 1729 నమూనాలో కూర్చున్న సాయిరవీంద్ర విద్యార్థులు


చంద్రంపాలెం హైస్కూల్లో గణిత ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు


గణితంలో విజేతలకు బహుమతి అందిస్తున్న మధురవాడ జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి


పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రాజెక్టు


విద్యార్థులు ప్రదర్శిస్తున్న గణిత సాంకేతిక నమూనాలు తిలకిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి


చంద్రంపాలెం హైస్కూల్లో గణిత ముగ్గుల పోటీలు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

క్లుప్తంగా

కొమ్మాదికి కొత్త కళ


కొమ్మాది కూడలి వద్ద ఏర్పాటు చేసిన గద్దలు

కొమ్మాది: నగర సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడలి వద్ద అనేక కళాకృతులు ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. ఇందులో భాగంగా మధురవాడ జాతీయ రహదారి కొమ్మాది జంక్షన్ వద్ద గద్దలు, సింహం వంటి ఆకృతులను ఏర్పాటు చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకలు

కొమ్మాది: బీచ్‌రోడ్డు తిమ్మాపురంలోని విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్‌లో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ క్యారల్స్, కొరియోగ్రఫీస్, స్కిట్స్‌తో అలరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య విద్యార్థులకు క్రీస్తు త్యాగాలను వివరించారు. సీఈఓ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం


ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: పేద, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం, విద్య అందించాలనేది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో శుక్రవారం 1,307 ఆరోగ్య శ్రీ కార్డులను లబ్ధిదారులకు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గీతా జయంతి ఉత్సవాలు

తగరపువలస: స్థానిక గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణస్వామి కొండ వద్ద శనివారం నుంచి 2024 జనవరి 9 వరకు గీతా జయంతి ఉత్సవాలు జరుగనున్నాయి. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి నగర సంకీర్తన అనంతరం గీతా అష్టోత్తరి శతనామావళితో పూజలు, సాయంత్రం గీతా పారాయణం ఉంటాయి. మొదటి రోజైన శనివారం గీతాచార్యుని పల్లకి ఉత్సవం నిర్వహించనున్నారు. జనవరి 7వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మోక్ష సన్యాసయోగంపై మూడు వర్గాలుగా విద్యార్థులకు భగవద్గీతపై క్విజ్, పఠన పోటీలు ఉంటాయి. 10న అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ 18 రోజుల పాటు సాయంత్రం 6.30 నుంచి 8 వరకు గీతా ప్రవచన కార్యక్రమాలు జరగనున్నాయి.

'పినాకిల్–2023' సదస్సు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం)లో శుక్రవారం పినాకిల్–2023 సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి డబ్ల్యూఎన్ఎస్ సెంటర్ హెడ్(విశాఖపట్నం) ఆర్.ఎల్.నారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు కృషి చేయాలన్నారు. విభిన్న అంశాలపై నైపుణ్యం, అవగాహన పెంచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

వెలమ సంఘం పిక్నిక్‌కు ఆహ్వానాలు

మధురవాడ: భీమిలి నియోజకవర్గం పరిధిలోని మధురవాడ గ్రేటర్ విశాఖ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మధురవాడ శిల్పారామం జాతరలో వన సమారాధన నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు పలువురు ప్రజా ప్రతినిధులకు, ముఖ్య నాయకులకు ఆహ్వానాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావును శ్రీకాకుళంలో కలిసి ఆహ్వానం అందజేశారు. అలాగే మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మి, బొగ్గు రమణమూర్తి తదితరులకు కూడా ఆహ్వానాలు అంజేశారు. వీరిలో సంఘ అధ్యక్షుడు చలుమూరి నాయుడు బాబు, ప్రధాన కార్యదర్శి దొగ్గ దుర్గాప్రసాద్, కోశాధికారి సిరపరపు గౌరీశంకర్, ఉపాధ్యక్షులు రంధి నాయుడు, సూరెడ్డి సత్యనారాయణ, ద్వారపురెడ్డి కృష్ణ, యూత్ ప్రెసిడెంట్ దొగ్గ గణేష్ తదితరులు ఉన్నారు.


వెలమ సంఘం వన సమారాధనకు మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆహ్వానిస్తున్న నాయకులు

ట్యాబ్‌లతో మరింత మెరుగ్గా విద్యాభ్యాసం

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రాపంచిక జ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం ఎంతో విలువైన బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందజేస్తోందని జీవీఎంసీ 7వ వార్డు వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పోతిన శ్రీనివాసరావు చెప్పారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో సునీల్‌శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను ఆయన పీఎంసీ చైర్‌పర్సన్ నీలమ్మ తదితరులతో కలిసి అందజేశారు. శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం కోసం ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని, ప్రభుత్వ పథకాలు అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మాణానికి సుమారు రెండున్నర కోట్లు నిధులు ఇచ్చిందన్నారు. హెచ్ఎం గీతాదేవి మాట్లాడుతూ ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించేటట్లు తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, మంగమ్మ, నాయకులు ఎల్లాజీ, బంగారు ప్రకాశ్, పసుపులేటి గోపి, పాపారావు, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు జి. శాండిల్య, సీహెచ్ నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.


మధురవాడ సునీల్ శర్మకాలనీలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

'పోటీ చేస్తున్నా... ప్రోత్సహించండి'

తగరపువలస : 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో భీమిలి నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేయనున్నానని ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు ఇవ్వాలని మధురవాడకు చెందిన నాగోతు నాగమణి కోరారు. చిట్టివలసలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన విద్యాభ్యాసం తగరపువలస, భీమిలిలో జరిగిందని తరువాత కూడా సంగివలస, చెరకుపల్లిలలో వివిధ విద్యాసంస్థలలో ఉద్యోగం చేసినట్టు తెలిపారు.

ఈ ప్రాంత వాసిగా ఇక్కడి సమస్యలు తెలిసిన తనను ప్రోత్సహించాలని ఆమె కోరారు. ఆమెతో పాటు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగోతు నాగమణి

విద్యార్థినులకు అభినందన

భీమునిపట్నం : విశాఖలో మూడు రోజులుగా జరిగిన అంతర్ పాలిటెక్నిక్ క్రీడల పోటీల్లో భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. శుక్రవారం కళాశాల వద్ద వీరికి అభినందన కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థినులు పలు క్రీడా విభాగాల్లో మంచి ప్రతిభను చూపి చాంపియన్‌షిప్‌ను గెలుచుకోవడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఇదే స్ఫూర్తితో వీరు మరిన్ని పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామాగ్రిని ప్రదక్షణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.


శ్రీవారికి పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

తగరపువలస: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం భక్తుల దర్శనార్థం వైష్ణవాలయాలలో ఉత్తర ద్వార దర్శనాలకు ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం స్వామివారిని దర్శించుకునే ద్వారాలను తాత్కాలికంగా మూసి వేశారు. వేకువజాము నుంచే భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వేంకటేశ్వరమెట్టపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, స్థానిక శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయం, షిర్డీ సాయిబాబా ఆలయం, చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయాలలో ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలు విద్యుద్దీపకాంతులతో వెలిగిపోతున్నాయి.


వేంకటేశ్వరమెట్టపై ఆలయంలో అలంకరణ

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో శనివారం జరగనున్న వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ లోపల భాగాన్ని పూలమాలలతో అందంగా అలంకరించారు. ఉదయం నాలుగు గంటలకు స్వామికి అభిషేకాలు జరుపుతారు. శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. తదుపరి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. సాయంత్రం బుట్ట పూజ నిర్వహిస్తారు.


వేంకటేశ్వరమెట్టపై ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

సైన్స్ ఎగ్జిబిషన్ విజేతలకు అభినందన



బి.శైలజ, విజయదుర్గ

తగరపువలస: ఇటీవల భీమిలి డైట్‌లో జరిగిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా మొదటి స్థానాలలో నిలిచిన ఉపాధ్యాయురాలు బి.శైలజ, 9వ తరగతి విద్యార్థిని విజయదుర్గలను శుక్రవారం రాయిప్పాలెం జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. విద్యార్థి విభాగాలలో విజయదుర్గ, ఉపాధ్యాయుల విభాగాలలో శైలజ ప్రథమ బహుమతులు గెలుచుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వీరిని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అభినందించారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు


శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప దీక్షధారులు

పద్మనాభం : మండలంలోని మద్దిలో శ్రీ దర్మశాస్త్రా సేవా పీఠంలో శుక్రవారం ఇరుముడులు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంపీపీ కంటుబోతు రాంబాబుతో పాటు అయ్యప్ప మాలలు ధరించిన 105 మందికి ఈ పీఠంలో ఇరుముడులు నిర్వహించారు. సామవేదం సీతారామశాస్త్రి వీరితో ఇరుముడుల పూజలు నిర్వహించారు. అనంతరం దీక్షధారులు శబరిమలకు బయలు దేరి వెళ్లారు.

అమర జవాన్ల పిల్లలకు ల్యాప్‌టాప్‌ల బహూకరణ


చిన్నారులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న సైనిక సంక్షేమ అధికారులు

ఏయూక్యాంపస్: అమర జవాన్ల పిల్లలకు ముంబైకు చెందిన అథర్వ ఫౌండేషన్ వారు ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. లాసన్స్ బే కాలనీలోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన ఐదుగురు అమర జవాన్ల పిల్లలకు వాటిని అందజేశారు. చిన్నారుల విద్యకు ఉపయుక్తంగా నిలిచేలా, వారిలో మానసిక స్థైర్యాన్ని నింపుతూ బాసటగా ఉండేలా అథర్వ ఫౌండేషన్ వీటిని పంపిణీ చేసింది. కార్యక్రమంలో కల్నల్ సుధీర్ రాజీ, బాలాజీ షిండే, లెఫ్టినెంట్ కల్నల్ భాషా, జి.సత్యానందం, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన ప్రేమ, దయాగుణం అనుసరణీయం

తగరపువలస: క్రీస్తు ఆచరించి చూపిన దయాగుణం, ప్రేమ ప్రపంచ మానవాళికి మార్గదర్శకం కావాలని భీమిలి కేథరిన్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్.రత్నరాజ్ అన్నారు. శుక్రవారం కేథరిన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆయన ఆహుతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచం యుద్ధాలతో కాకుండా శాంతి, సహనంతో విలసిల్లాలని కోరారు. ఈ సందర్భంగా క్రీస్తు రాకడ గురించి విద్యార్థులు అభినయించిన నాటకం, క్రీస్తు గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఆలీవర్ ఆర్.రాయి, ఇవాంజలిన్ రాయి తదితరులు పేదలకు, విద్యాసంస్థల సిబ్బందికి వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి బెలూన్లు ఎగురవేశారు.


క్రిస్మస్ పాటకు అభినయిస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

భీమునిపట్నం: భీమిలిలోని సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, బీజీఎం ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల కమిటీ చైర్మన్ పి.జి.కె.వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అతిథిగా పూర్వ విద్యార్థి, ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు డాక్టర్ రవిచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంటాక్లాజ్, దేవదూతల రోల్‌ప్లే, క్రీస్తు జననం మొదలైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గౌరవ అతిథి రవిచరణ్ కేక్ కట్ చేశారు. కరస్పాండెంట్ పి.ఎ.విజయకుమారి, ముఖ్య ఆహ్వానితులు పి.ఎస్.చంద్, మైలిపల్లి షణ్ముఖరావు పాల్గొనగా పాస్టర్ రెవరెండ్ విజయకుమార్ దైవ సందేశాన్ని అందించారు.


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ రవిచరణ్

సంచార జాతుల వారికి దుప్పట్లు, ఆహారం పంపిణీ

తగరపువలస: కలిగొట్ల భాస్కరరావు వర్ధంతి సందర్భంగా భీమిలికి చెందిన స్నిగ్ధశ్రీ ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామమూర్తి సంచారజాతులకు చెందిన వంద మందికి శుక్రవారం దుప్పట్లు, ఆహారం, బిస్కట్లు పంపిణీ చేశారు. వలందపేట, ఆనందపురం, మోదవలస గ్రామాల్లో గుడారాలలో నివాసం ఉంటున్న వారికి ఈ సహాయం అందించారు. కార్యక్రమంలో శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


వలందపేటలో సంచారజాతుల వారికి దుప్పట్లు, ఆహారం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు